క్లుప్తంగా

వివాహానికి ఆర్థిక సాయం

రామన్నపేట: నగరంలోని శాంతినగర్‌లో నివాసముంటున్న పేద కుటుంబమైన మచ్చ నరసింహులు – సుమిత్ర దంపతుల కుమార్తె వివాహానికి వైశ్య ఫెడరేషన్ నాయకులు ఆర్థిక చేయూతనందించారు. వధువు కుటుంబ సభ్యులకు వరంగల్ జిల్లా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు గట్టు మహేష్.. పుస్తె, మట్టెలు, గాజులు, పసుపు, కుంకుమ, బియ్యం, నగదును అందించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి టీ.వీరన్న, జిల్లా అధ్యక్షుడు పుల్లూరి మధు, ప్రధాన కార్యదర్శి గుమ్మడవెల్లి సురేష్, నాయకులు రాజేందర్, శైలజ, శ్రీధర్, మురళి, రమేష్, ప్రవీణ్, ప్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసేందుకే..

ఖిలా వరంగల్: మతతత్వ బీజేపీ, రాష్ట్ర సంపదను దోసుకున్న బీఆర్ఎస్ పార్టీలు పరస్పరం సహకరించుకుంటున్నాయని, ప్రజలను మోసం చేసేందుకు మరోసారి ప్రజల వద్దకు వచ్చే ఆ పార్టీ నేతలను చిత్తుగా ఓడించాలని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి పిలుపునిచ్చారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఎలేందర్ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను చూస్తే 'నా ఇంటికొస్తే ఏం తెస్తావు.. నీ ఇంటికొస్తే ఏం ఇస్తావు' అనే చందంగా ఉందని ఎద్దేవాచేశారు. సమావేశంలో సీపీఐ నేత పంజాల రమేష్, గన్నారపు రమేష్, చంద్రకళ, బుస్స రవి, రమేష్, దండు లక్ష్మణ్, శంకరయ్య పాల్గొన్నారు.

పరంజ్యోతిపై సస్పెన్షన్ వేటు

వరంగల్: వరంగల్ దేశాయిపేట రోడ్డుకు చెందిన జన్ను పరంజ్యోతిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెన్షన్ చేస్తున్నట్లు పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నాయకుల పట్ల పరంజ్యోతి అమర్యాదగా ప్రవర్తించడం, ఇష్టానుసారంగా వ్యవహరించడం, పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతుండడంతో టీపీసీసీకి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. పార్టీ ఆదేశాల మేరకు వేటు వేసినట్లు తెలిపారు.

ఎరుకల కుల సంక్షేమానికి కృషి



ఖిలా వరంగల్: ఎరుకల కులస్తుల సంక్షేమానికి మరింతగా కృషి చేస్తామని వరంగల్ పట్టణ గిరిజన సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్, గిరిప్రసాద్ నగర్ కాలనీ అధ్యక్షుడు, మైనార్టీ నేత ఎండీ.ఉల్ఫత్ అన్నారు. వరంగల్ శంభునిపేట దూపకుంట రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో పట్టణ గిరిజన సంక్షేమ సేవా సంఘం (ఎరుకల) నాయకులు శోభాల ఏడుకొండలు, మద్దెల పోతరాజు ఆధ్వర్యంలో ఉల్ఫత్ అధ్యక్షతన ఎరుకల కుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా వారు మాట్లాడుతూ స్వచ్ఛందంగా సంఘ గిరిజనులందరు ఏకమై బీఆర్ఎస్ తూర్పు ఎమ్మెల్యే నరేందర్ గెలుపు కోసం పనిచేస్తామని ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిపారు.

బీమా చెక్కు అందజేత


హన్మకొండ : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత రూ.40 లక్షల చెక్కు అందజేశారు. హనుమకొండలోని ఆర్ఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డ్రైవర్ బీమ్‌లాల్ సతీమణి కె.స్వరూపకు రూ.40 లక్షల యూబీఐ చెక్కును శ్రీలత బుధవారం అందజేశారు. ప్రమాదంలో మరణించే ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించేందుకు టీఎస్ ఆర్టీసీ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రమాద బీమా ద్వారా రూ.52 లక్షలు అందించేలా ఒప్పందం చేసుకున్నాయి. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు మాధవ రావు, కేశరాజు భాను కిరణ్, వరంగల్-2 డిపో మేనేజర్ జి.సురేష్ పాల్గొన్నారు.

రైల్ మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీగా ప్రభుచరణ్



కాజీపేట రూరల్: రైల్ మజ్దూర్ యూనియన్ (ఆర్ఎంయూ) దక్షిణ మధ్య రైల్వే జనరల్ సెక్రటరీగా హనుమకొండ వడ్డెపల్లికి చెందిన కాచిగుడ రైల్వే స్టేషన్ రిటైర్డ్ డైరెక్టర్ డాక్టర్ తాళ్లపల్లి ప్రభుచరణ్ నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. నియామక ఉత్తర్వులను రైల్ మజ్దూర్ యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి శుభాష్ మాల్గి జారీ చేసినట్లు తెలిపారు. ప్రభుచరణ్‌ను పలువురు అభినందించారు.

ఐఎన్‌టీయూసీ గ్రేటర్ వైస్ ప్రెసిడెంట్‌గా హనుకాంత్



కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే కాలనీకి చెందిన యమదాల హనుకాంత్ ఐఎన్‌టీయూసీ గ్రేటర్ వరంగల్ వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈమేరకు హనుకాంత్‌కు హనుమకొండ విశాల్ భవన్‌లో హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి నియామక పత్రాన్ని బుధవారం అందజేశారు.

రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సేవలు భేష్!

కాజీపేట: పక్షవాతంతో పాటు వృద్ధాప్యం మీదపడడంతో కాళ్లు, చేతులు చచ్చుబడిపోయి మంచానికే పరిమితమైన రైల్వే రిటైర్డ్ పెన్షనర్లను గుర్తించి వారి ఇళ్ల వెళ్లి జీవన ప్రమాణ పత్రం నమోదు చేస్తూ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు శభాష్ అనిపించుకుంటున్నారు. రైల్వే రిటైర్డ్ ఉద్యోగులు పదవీ విరమణ పొందిన అనంతరం ప్రతీనెలా పింఛన్ పొందుతారు. అందుకు తాము జీవించి ఉన్నట్లు జీవన ప్రమాణ పత్రాన్ని లబ్ధిదారులు ఏటా సమర్పించాల్సి ఉంటుంది. నవంబర్ నెల నుంచి రిటైర్డ్ ఉద్యోగులు, పింఛన్‌దారులు తాము బతికి ఉన్నట్లుగా జీవన ప్రమాణ పత్రాన్ని సంబంధిత కార్యాలయాలకు బ్యాంకుల ద్వారా సమర్పించాల్సి ఉంటుంది. ఈక్రమంలో నడవలేని పరిస్థితిలో ఉన్నా ఎలాగైనా కష్టపడి కార్యాలయానికి వెళ్లాల్సిందే. ఈ నేపథ్యంలో పదవీ విరమణ పొందిన ఉద్యోగుల డిమాండ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకుని నిబంధనల్లో సడలింపునిచ్చాయి. ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసే వెసులుబాటు కల్పించాయి. ఏడాదిలో ఎప్పుడైనా వివరాలను సమర్పించేలా అవకాశం కల్పించాయి. దాంతో వయసు మీద పడిన వారు, దివ్యాంగులు కార్యాలయాలకు రాలేని పరిస్థితుల్లో వారిని పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు గుర్తించి వారి ఇళ్ల వద్దకే వెళ్లి ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేస్తుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అదనపు రుసుం లేకుండా సహచర పింఛన్‌దారులకు చేయూతనందిస్తుండడం పట్టణంలో చర్చనీయంశంగా మారింది.



కాజీపేటలో వృద్ధురాలి వివరాలను నమోదు చేస్తున్న సభ్యుడు



లైఫ్ సర్టిఫికెట్ అందజేస్తున్న యూనియన్ నాయకులు

వృద్ధ పెన్షనర్ల వద్దకే లైఫ్ సర్టిఫికెట్లు

కాజీపేట అర్బన్: వృద్ధ పెన్షనర్ల వద్దకు కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలో రైల్వే రిటైర్డ్ పెన్షన్ అసోసియేషన్ నాయకులు సాధినేని సూర్యనారాయణ, మారపాక కట్టస్వామి ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో లైఫ్ సర్టిఫికెట్లను బుధవారం అందజేశారు. ప్రతీఏడాది నవంబర్‌లో రైల్వే పెన్షనర్లు పింఛన్ నిమిత్తం బ్యాంకులో సమర్పించాల్సిన లైఫ్ సర్టిఫికెట్ కోసం వృద్ధులు ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితుల్లో వారి ఇంటి వద్దకే వెళ్లి లైఫ్ సర్టిఫికెట్ల జారీప్రక్రియను పూర్తి చేసినట్లు నాయకులు తెలిపారు. కాగా, యూనియన్ నాయకులకు వృద్ధ పెన్షనర్లు కృతజ్ఞతలు తెలిపారు.

నగరంలో జోరుగా నామినేషన్లు



పశ్చిమ రిటర్నింగ్ అధికారి ఎల్.రమేష్‌కు నామినేషన్ పత్రం అందజేస్తున్న గట్ల యుగేందర్



పత్రాన్ని అందజేస్తున్న గొల్లెన నరేందర్



నామినేషన్ దాఖలు చేస్తున్న సత్యప్రకాశ్



నామినేషన్ పత్రం సమర్పిస్తున్న బంక రాజు



తూర్పు ఆర్వో షేక్ రిజ్వాన్ బాషాకు నామినేషన్ అందజేస్తున్న కమలాకర్



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న రంగరాజు రవీందర్

హన్మకొండ అర్బన్/వరంగల్ అర్బన్: హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలో శాసన సభ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్లు జోరందుకున్నాయి. ఈనెల 3న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ 10వ తేదీ వరకు కొనసాగనుంది. బుధవారం వరంగల్ పశ్చిమ, తూర్పు, వర్ధన్నపేట, పరకాలలో పలువురు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నామిషనేషన్లు దాఖలు చేశారు.

- హన్మకొండ అర్బన్ / వరంగల్ అర్బన్

ఈసీ ఆదేశాలు అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: వికలాంగుల ఉద్యోగులకు ఎన్నికల విధులకు మినహాయింపు ఇవ్వాలని అధికారులను ఈనెల 4న తెలంగాణ ఎన్నికల కమిషన్ ఆదేశించిందని వికలాంగుల ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు ఈసీ ఆదేశాలను అమలు చేయాలని హనుమకొండ అదనపు కలెక్టర్ మహేందర్‌జీ కలెక్టరేట్‌లో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఎన్నికల విధులు సరిగా నిర్వర్తించడం కష్టంగా ఉన్న వికలాంగ ఉద్యోగులు, పాలిచ్చే తల్లులు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న ఉద్యోగులు, రిటైర్‌మెంట్‌కు ఆరు నెలల సమయం మాత్రమే ఉన్న ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చే విషయాన్ని పరిశీలించాలని కోరారు. అనంతరం మహేందర్‌జీ మాట్లాడుతూ వికలాంగ ఉద్యోగులకు దగ్గర ప్రాంతాల్లోనే ఎన్నికల విధులు కేటాయిస్తామని చెప్పారు. సరైన వికలాంగత్వం ఉంటే తప్ప విధుల నుంచి మినహాయింపు ఇవ్వబోమని స్పష్టం చేశారు. కాగా, ఎన్నికల విధులకు సిబ్బంది తక్కువయ్యే అవకాశం ఉన్నందున అధిక వైకల్యంతో బాధపడుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల జాబితాను అదనపు కలెక్టర్‌కు సంఘం నాయకులు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు మన్నె చంద్రయ్య, వైట్ల వాణి, తదితరులు పాల్గొన్నారు.

ఒక్కటైన ప్రేమ జంట



నవ వధువరులతో ప్రజాసంఘాల నాయకులు

హన్మకొండ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా ఓ ప్రేమ జంట ఒక్కటైంది. వివరాలు ఇలా ఉన్నాయి. కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన గౌడ సామాజిక వర్గానికి చెందిన బొగ్గుల రాజేష్ (23), ముస్లిం మైనారిటీ వర్గానికి చెందిన మహమ్మద్ సోనీ (21) నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వారి వివాహానికి వధువు కుటుంబ సభ్యులు అడ్డుచెప్పడంతో సామాజిక, ప్రజా సంఘాల నాయకుల సమక్షంలో హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం మతాంతర వివాహం జరిగింది. అనంతరం, తమకు వధువు కుటుంబ సభ్యులతో ప్రాణభయం ఉన్నదని, రక్షణ కల్పించాలని హనుమకొండ హంటర్ రోడ్డులోని కాజీపేట ఏసీపీ కార్యాలయంలో ప్రేమికులిద్దరు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్, దళిత బహుజన ఫ్రంట్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లా వినోద్, న్యాయవాదులు తాళ్లపల్లి మధుకర్, సృజన, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ఐక్యవేదిక కృషి



వినతిపత్రం అందజేస్తున్న ఐక్య వేదిక ప్రతినిధులు

వరంగల్ అర్బన్: పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా హనుమకొండ జిల్లా పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక (యూఎఫ్ఈపీ) పనిచేస్తున్నట్లు వేదిక ప్రతినిధులు తెలిపారు. అందుకు బల్దియా సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. తడి చెత్త, పొడి చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో వేరు చేయుట, నగర పరిధిలో ఉన్న చెరువులు, కుంటల పరిరక్షణ కమిటీలో తమ సంస్థ సభ్యులను భాగస్వాములు చేయాలని కోరారు. ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేదని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను నివారించాలని సూచించారు. కాగా, ఐక్య వేదిక చేపట్టనున్న పర్యావరణ సమస్యలపై తమ వంతు సహకారం అందిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి శ్రవణ్ కుమార్, ఉపాధ్యక్షుడు రవిబాబు, సహాయ కార్యదర్శి రాజయ్య, పరశురాములు, శ్రీనివాస్, జగన్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో పిల్లలను వినియోగించొద్దు

హనుమకొండ: ఎన్నికల ప్రచారంలో 18 ఏళ్ల లోపు పిల్లలను వినియోగించడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని సీడబ్ల్యూసీ మాజీ చైర్‌పర్సన్, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు అనితారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పిల్లల ఫొటోలు సోషల్ మీడియాలో కనపడుతున్నాయని, దీనిపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. పిల్లల హక్కులకు భంగం కలిగితే 1098, 100 నంబర్లలో ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు.

కాంగ్రెస్ పాలనలో నిత్యం కష్టాలే

- బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి రమేష్



ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న అరూరి రమేష్

పర్వతగిరి: యాభై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో నిత్యం కష్టాలు, కన్నీళ్లే తప్ప ఏం మిగిలిందని బీఆర్ఎస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. మండలంలోని వడ్లకొండ, రోళ్లకల్, నారాయణపురం, సోమారం, జమలాపురం, గోరుగుట్టతండా, చౌటపల్లి, హట్యతండా, దౌలత్‌నగర్, సీకే తండా, ఇస్లావత్ తండాల్లో బుధవారం గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని కల సమయంలో కొత్త కొత్త వేషాలతో కొంత మంది వస్తున్నారని, వారిని నమ్మి మోసపోయి గోస పడొద్దని తెలిపారు. నియోజకవర్గంలో రూ.4,354 కోట్లతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. అభివృద్ధిని చేశా ఆశీర్వదించి మరొక సారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జూడో పోటీల్లో అంధుల ప్రతిభ

హన్మకొండ : ఈ నెల 3వ తేదీన హైదరాబాద్‌లోని ఓవైసీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అంధుల జూడో పోటీల్లో వరంగల్‌కు చెందిన క్రీడాకారులు ఎనిమిది బంగారు పతకాలను సాధించారు. కాగా విజేతలను తెలంగాణ జూడో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ బుధవారం హనుమకొండలోని ఆయన నివాసంలో అభినందించారు. రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాలు సాధించడం ఇతర క్రీడాకారుల్లోనూ స్ఫూర్తి నింపుతుందన్నారు. జాతీయ స్థాయిలో సైతం పతకాలు సాధించి జిల్లా ఖ్యాతిని చాటాలని సూచించారు. క్రీడల్లో ప్రోత్సహిస్తున్న లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ నలిమెల కళ్యాణి, కోచ్ ఎస్.కుమారస్వామిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకోవాలి



సెమినార్‌లో మాట్లాడుతున్న రామచంద్రయ్య

విద్యారణ్యపురి: విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకోవాలని వరంగల్ నిట్ ప్రొఫెసర్ రామచంద్రయ్య సూచించారు. నిరంతర పరిశోధన, స్వతంత్రంగా ఆలోచించే ప్రవృత్తి అనేవి విజ్ఞానశాస్త్ర సాగరాన్ని మదించివేస్తాయని అన్నారు. వైజ్ఞానిక రంగంలో తొలి నోబెల్ బహుమతి అందుకున్న భారతరత్న సర్ సీవీ.రామన్ జయంతిని పురస్కరించుకొని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక, రసాయన శాస్త్రాల విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రామన్ ఎఫెక్ట్ ఫలితంపై ప్రసంగించారు. నాడు వైజ్ఞానిక రంగంలో సీవీ.రామన్ చేసిన సేవలను కొనియాడారు. ఒక పదార్థంలో ఉన్న అణువుల నిర్మాణ శిల్పం తెలుసుకోవటానికి, పరిశ్రమల్లో కృత్రిమ రసాయనిక సమ్మేళనాల పరిశీలనకు, వైద్య రంగంలో అవసరమయ్యే ఔషధాల విశ్లేషణకు రామన్ ఫలిత ప్రభావం ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. సెమినార్‌లో కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, ఐక్యూఏసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ రమేష్, అధ్యాపకులు మసూద్ అహ్మద్, డాక్టర్ కందాల సత్యనారాయణ, శ్రీనివాస్, డాక్టర్ ఆలిశాల అశోక్, రాజు, డాక్టర్ కిరణ్, డాక్టర్ నరేందర్‌రెడి, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లలో పోలీసుల తనిఖీలు



కాజీపేట జంక్షన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు



కాశిబుగ్గ: వరంగల్ రైల్వే జంక్షన్‌లో..

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్ ఆధ్వర్యంలో సివిల్, రైల్వే పోలీసులు బుధవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో రైల్వే స్టేషన్‌లోని అన్ని రైల్వే ప్లాట్‌ఫాంలు కలియ తిరిగారు. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను, వస్తువులను తనిఖీ చేశారు. తనిఖీల్లో సివిల్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు, ఎస్సై లలిత, పోలీసులు, జీఆర్పీ పోలీసులు పాల్గొన్నారు.

రైళ్లలో బాణసంచా తరలిస్తే కఠిన చర్యలు

కాశిబుగ్గ: రైళ్లలో బాణసంచా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్పీఎఫ్ పోలీసులు హెచ్చరించారు. వరంగల్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంలలో రైల్వే అధికారులతో కలిసి ఆర్పీఎఫ్ సిబ్బంది బుధవారం తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల బ్యాగులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైళ్లలో బాణసంచా వంటి పేలుడు పదార్థాలను తరలించవద్దని సూచించారు. ఒకవేళ అలాంటి వాటితో పట్టుబడితే రైల్వే యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తప్పవని అన్నారు. తనిఖీల్లో ఆర్పీఎఫ్ ఏఎస్సై నరేందర్, సీటీఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.

సంక్షిప్తంగా

11న తెలంగాణ పీపుల్స్ జేఏసీ సదస్సు

వరంగల్ చౌరస్తా: హనుమకొండలోని హరితహోటల్‌లో ఈనెల 11న జరగనున్న తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ సదస్సును జయప్రదం చేయాలని టీపీజేఏసీ నాయకులు కోరారు. వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో సదస్సు కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సదస్సుకు టీపీజేఏసీ రెండు జిల్లాల కన్వీనర్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అధ్యక్షత వహిస్తారని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బీ.సుదర్శన్ రెడ్డి, టీపీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్, కో కన్వీనర్లు కన్నెగంటి రవి, అంబటి నాగయ్య, డాక్టర్ జిలకర శ్రీనివాస్, క్రాంతి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రవిచందర్, రమాదేవి, రాచర్ల బాలరాజు, జనగాం కుమారస్వామి, కాంపల్లి ప్రవీణ్, మైదం సంజీవ, శ్యామ్ పాల్గొన్నారు.

సిలబస్ పూర్తి చేయకుండానే పరీక్షలా?

కేయూ క్యాంపస్: హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్) డిగ్రీ విద్యార్థులకు పాఠాల (సిలబస్)ను పూర్తి చేయకుండానే 3, 5వ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను కళాశాల విడుదల చేయటం ఏమిటని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు ప్రశ్నించారు. ఈమేరకు కళాశాల వద్ద బుధవారం బైటాయించి ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య దృష్టికి తీసుకెళ్లి, వైస్ ప్రిన్సిపాల్ హనుమంతుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం నిరసన తెలిపి మాట్లాడారు. ఈనెల 9నుంచి నిర్వహించనున్న పరీక్షల షెడ్యూల్‌ను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ కేయూ జాయింట్ సెక్రటరీ స్టాలిన్ మాట్లాడుతూ సంబంధిత డిగ్రీ విభాగాల అధిపతులతో ప్రిన్సిపాల్ చర్చించి సిలబస్ అయిందా లేదో తెలుసుకోకుండానే పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేయడం శోచనీయమని అన్నారు. సిలబస్ పూర్తిచేశాకే పరీక్షల టైంటేబుల్‌ను విడుదల చేయాలని సూచించారు. అభిషేక్, శరత్, శ్రావణ్, లోకేష్, సురేష్, చరణ్, సిద్ధు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఆర్‌లో క్యాన్సర్ సెంటర్ ప్రారంభం

వరంగల్: వరంగల్ అపోలో హాస్పిటల్స్‌లో క్యాన్సర్ చికిత్స సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సర్జికల్ సీనియర్ అంకాలజిస్ట్ డాక్టర్ విజయ్‌ఆనంద్ రెడ్డి తెలిపారు. 3వ డివిజన్ పరిధిలోని వరంగల్ అపోలో ఎస్ఎస్ఆర్ ఆస్పత్రి క్యాన్సర్ విభాగాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌కు అధునాతన చికిత్స విధానాలు, టెక్నాలజీతో పాటు, రోగులకు పర్సనలైజ్డ్ సెంట్రిక్ కేర్‌ను అందించాలనే ఉద్దేశంతో అపోలో ఆస్పత్రిలో క్యాన్సర్ విభాగాన్ని స్థాపించినట్లు వివరించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో క్యాన్సర్ సెంటర్ నిపుణులు ప్రతివారం ఇక్కడికి వచ్చి రోగులను పరీక్షిస్తారని వివరించారు. ముందస్తుగా స్క్రీనింగ్ చేయించుకోవడం, క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా క్యాన్సర్ బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. సర్జికల్ అంకాలజిస్ట్ - రోబోటిక్ సర్జన్ డాక్టర్ జగదీశ్వర్‌గౌడ్, ఎస్ఎస్ఆర్ చైర్మన్ ఎన్.సంపత్‌రావు, సీఈఓ డాక్టర్ నగేష్ పాల్గొన్నారు.

మాదిగల విశ్వరూప మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కాజీపేట అర్బన్: ఈనెల 11వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభ వాల్‌పోస్టర్లను 31వ డివిజన్‌లోని న్యూశాయంపేట చౌరస్తాలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా మాదిగలు ఏకమై ఎస్సీ వర్గీకరణ సాధించుకోవాలని సూచించారు. మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతానికి భారీ సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ కోరారు. మహాసభకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హాజరు కానున్నారని చెప్పారు. ఈక్రమంలో ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన హామీ ఇచ్చే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సుకుమార్, జన్ను దినేష్‌మాదిగ, గంగారపు శ్రీనివాస్, శాంతిసాగర్, కిరణ్, వర్ధన్, రాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.

రేడియోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించండి

నయీంనగర్: రేడియాలజీ విభాగంలో పనిచేస్తున్న రేడియోగ్రాఫర్ల సమస్యలను పరిష్కరించాలని వరంగల్ జిల్లా రేడియోగ్రాఫర్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు అరికిల్ల సుమన్ కోరారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించుకోవడానికి, చర్చించుకోవడానికి భవనం అవసరమని అన్నారు. ఈక్రమంలో ఏ పార్టీ అయితే కార్మికుల సమస్యలు తీర్చుతుందో ఆ పార్టీ అభ్యర్థికే తాము మద్దతు తెలుపుతామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్.సునీల్, సుధీర్, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోస్టల్ కాలనీ, దీన్‌దయాళ్‌నగర్‌లలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈమేరకు రూ.11,920 విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. పోస్టల్ కాలనీలోని గజ్జికొండ వీరేశ్, దీన్‌దయాళ్‌నగర్‌లోని పల్లెపు శ్రీకాంత్‌ను, మద్యం బాటిళ్లను సుబేదారి పోలీసులకు అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ బాబులాల్, ఎస్సై వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ తూర్పుకోటలోని బిల్లా కరుణాకర్‌కు చెందిన బెల్ట్‌షాపుపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి రూ.3,760 విలువైన మద్యాన్ని, పిట్టల స్వరూప ఇంట్లో రూ.4980 విలువగల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ సురేష్‌గౌడ్‌కు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు లవన్‌కుమార్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

శివనగర్‌లో చోరీకి యత్నం

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని పద్మశాలి ఫంక్షన్ హాల్ వెనుక లేన్‌లో దొంగలు చోరీకి యత్నించారు. మంగళవారం అర్ధరాత్రి ప్రధాన గేట్‌లో నుంచి ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంటి ప్రాంగణంలోకి చొరబడ్డారు. ఆ ఇంటిలో అద్దెకుంటున్న వారి గదివైపు వెళ్లారు. తొలుత మెష్ డోర్ ధ్వంసం చేసి ఆతర్వాత మెయిన్ డోర్ తీసే ప్రయత్నం చేస్తుండగా శబ్దం రావడంతో ఇంట్లోని మహిళ ఎవరంటూ ప్రశ్నించారు. తలుపుకు తీయకుండా కిటికీలోంచి దొంగల కళ్లలో కారం చల్లింది. అనంతరం పోలీసులకు ఫోన్ చేస్తుండగా అది విన్న దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు.

మైసమ్మ బోనమెత్తిన స్వర్ణ

ఖిలా వరంగల్: వరంగల్ 34వ డివిజన్ భూపేష్‌నగర్‌లో స్థానిక కాంగ్రెస్ నాయకుడు కరాటే ప్రభాకర్ ఆధ్వర్యంలో బుధవారం మైసమ్మ బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు, నగర మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ హాజరై బోనం ఎత్తుకుని మహిళలతో కలిసి మైసమ్మ గుడికి వెళ్లారు. అమ్మవారికి పరమాన్నాన్ని నైవేద్యంగా సమర్పించారు. మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.